www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 ఏప్రిల్ 2025

5

ఏలూరు

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 21న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) అన్నిస్థాయిలో యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు.

మండల, డివిజన్, మండలస్థాయిలో ఆయా అధికారులు పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చునని తెలిపారు.

ఎట్టకేలకు డిఎస్‌సికి మోక్షం

- ఏడాదిగా ఊరించి నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- పరీక్షకు 45 రోజుల వ్యవధి ఇవ్వడంపై అభ్యర్థుల్లో అసంతృప్తి
- ఉమ్మడి పశ్చిమలో మొత్తం 1,074 పోస్టులు మంజూరు
- 25 వేల మందికిపైగా అభ్యర్థులు పోటీపడే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎట్టకేలకు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలైంది. నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం ఆదివారం పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుంచి జులై ఆరో తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. మెగా డిఎస్‌సి-2025 పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం అంటే సంబంధిత జిఒలు, పోస్టుల వివరాలు, పరీక్ష షెడ్యూల్, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్‌డెస్క్ వివరాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని కేటగిరీల్లో 1,074 పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 420 ఉండగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 615 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో లాంగ్వేజ్-1 పోస్టులు 42, హిందీ 61, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 40, ఫిజికల్ సైన్స్ 40, బయోలజీ 64, సోషల్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 181 ఉన్నాయి. ఇవి కాకుండా ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 32 పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పాఠశాలల్లో ఏలూరు జిల్లాలో ఏడు పోస్టులు ఉన్నాయి. విభిన్న ప్రతిభావంతుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో 31 పోస్టులు, ఎపి రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జోన్-2లో 348 పోస్టులు ఉన్నాయి. వీటిలో కూడా జిల్లా అభ్యర్థులు పోటీ పడవచ్చు. ఏప్రిల్ 20 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు ఫీజు చెల్లించవచ్చు. అలాగే నమూనా పరీక్ష మే 20వ తేదీ నుంచి నిర్వహిస్తారని నోటిఫికేషన్‌లో తెలిపారు. జూన్ ఆరో తేదీ నుంచి జులై ఆరో తేదీ వరకు డిఎస్‌సి పరీక్షలు జరగనున్నాయి. అన్ని పరీక్షలు పూర్తయ్యాక ప్రాథమిక కీ విడుదల చేస్తారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రాథమిక కీ విడుదల అనంతరం ఏడు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరిస్తారని, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల చేస్తారని, తుది కీ విడుదల చేసిన ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితా ప్రకటిస్తారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

45 రోజుల సమయంపై అసంతృప్తి

2019 తర్వాత ఇప్పటి వరకు ఐదు సంవత్సరాలపాటు డిఎస్‌సి నిర్వహించలేదు. సుమారు 25 వేల మంది అభ్యర్థులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీపడే అవకాశం కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం తొలిసంతకం మెగా డిఎస్‌సిపై పెట్టింది. దీంతో అభ్యర్థులంతా కోచింగ్ సెంటర్లకు వెళ్లి కష్టపడ్డారు. ఏడాది గడుస్తున్నా నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో చాలామంది మళ్లీ పుస్తకాలను పక్కన పెట్టేశారు. నోటిఫికేషన్, పరీక్షకు మధ్య కేవలం 45 రోజుల సమయం మాత్రమే ఇచ్చారంటూ అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

మంత్రి పార్థసారధి ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు టౌన్ : పండ్లు అందిస్తున్న మంత్రి పార్థసారధి

సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యాన సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని స్నేహ రైడ్స్ చిల్డ్రన్స్ హోమ్‌లో బాలికలకు అన్నదానం చేశారు. తుక్కులూరులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆలోచన ఎప్పుడూ రాష్ట్ర, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమేనన్నారు. సుమారు రూ.5 కోట్లతో ఎన్ఎస్‌పి కాలువ పనులు చేపట్టామని, ఫలితంగా వేల ఎకరాలకు నియోజకవర్గంలో సాగునీరు అందించామన్నారు. త్వరలో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేసి నూజివీడు నియోజకవర్గ రైతుల కల నెరవేరుస్తానన్నారు.



ఏలూరు సిటీ : కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ చంటి

ఏలూరు సిటీ: అసామాన్య పాలనా అనుభవం, మహోన్నత వ్యక్తిత్వం సిఎం చంద్రబాబు సొంతమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంఎల్ఎ చంటితోపాటు మేయర్ షేక్ నూర్జహాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.307 వేతనాన్ని అమలు చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉపాధి హామీ వేతన బకాయిలు 2025 ఫిబ్రవరి 1 నుండి మార్చి 31 వరకు ఉన్నాయని, ఈ రెండు నెలల వేతన బకాయిలు సుమారుగా రూ.49.83 కోట్లు ఉంటాయని పేర్కొన్నారు. నూతన ఆర్థిక సంవత్సరంలో రెండు వారాల వేతన బకాయిలు రూ.11.56 కోట్లతో కలిపి మొత్తంగా రూ.61.39 కోట్లు ఉపాధి హామీ కూలీలకు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడే పేదలకు పనైనా కల్పించాలి లేదా తిండైనా పెట్టాలనే ఉద్దేశంతో పోరాడి సాధించుకున్నదే ఈ ఉపాధి హామీ చట్టం అని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేలా వేతన బకాయిలు సకాలంలో విడుదల చేయకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల వేతనాలను రూ.300 నుండి రూ.307కు పెంపును అమలు చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఇవ్వాల్సిన పనిముట్లు, పే స్లిప్‌లు, రవాణా ఛార్జీలు, మెడికల్ కిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను మండల అధికారులకు అనేక సార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడం లేదని, గత ఆర్థిక సంవత్సరంలో చింతలపూడి, దెందులూరు, జంగారెడ్డిగూడెం మండలాల్లో చనిపోయిన కూలీల కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం అందలేదని తెలిపారు. జిల్లాలోని 27 మండలాల్లోనూ ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, కూలీలకు పెండింగ్లో ఉన్న వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పే స్లిప్‌లు, వేతనాలు 15 రోజులకు ఒకసారి ఇవ్వాలని కోరారు.

కేంద్రమంత్రిచే ఐస్ ఫ్యాక్టరీ ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఐస్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ

ఆక్వా ఆధారిత పరిశ్రమల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉంగుటూరు ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దిన ఆర్నవ్ గ్రూప్ యాజమాన్యం అభినందనీయులని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఉంగుటూరులో సొంకర మనోజ్ కుమార్, ఆర్నవ్ కుమార్ ఆధ్వర్యంలో (ఆర్నవ్ గ్రూప్) నూతనంగా నిర్మంచిన 'శ్రేష్టి ఐస్ ఫ్యాక్టరీ'ని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలసి కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్దాక్షిణ్యంగా 42 ఇళ్లు కూల్చివేత

- పేదలు బతిమాలినా బలవంతంగా ఖాళీ చేయించి బుల్డోజర్‌తో పడగొట్టించిన అధికారులు
- పేదల రోదనలతో హోరెత్తిన ఎస్ఆర్ నగర్
- మొహరించిన 150 మంది పోలీసులు
- గృహనిర్బంధంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, నేతలు సత్యనారాయణ, అశ్రియ్య
- భూస్వాములకు దోచిపెట్టేందుకే పేదలపై ఎంఎల్ఎ యుద్ధం
- సిపిఎం పశ్చిమ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

కూల్చివేతకు గురైన ఇళ్లు

గృహనిర్బంధంలో సిపిఎం భీమవరం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ ఆదివారం నిరుపేదల ఆర్తనాదాలతో హోరెత్తింది. తమ గూడు కూలగొట్టొద్దు అంటూ బతిమాలినా అధికారులు కనికరం చూపకపోవడంతో వారు నిశ్చేష్టులయ్యారు. పొయ్యిపై అన్నం ఉడుకుతున్నా బలవంతంగా పేదలను ఖాళీ చేయించారు. కరెంటు కనెక్షన్లు కట్ చేసి బుల్డోజర్లతో ఇళ్లను పడగొట్టారు. ఇంటికి పది మంది పోలీసులను మొహరించి ఆ ప్రాంతాన్ని దిగ్బంధనం చేశారు. ఆపై పేదలకు చెందిన 42 ఇళ్లను కూలగొట్టారు. పేదలకు మద్దతుగా వస్తారనే ఆలోచనతో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను గృహనిర్బంధం చేయగా, పేదల వద్దకు వస్తున్న జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణను పోలీసులు మధ్యలో అడ్డుకుని నిర్బంధించారు.

ఎఎస్ఆర్ నగర్‌లో పేదల ఇళ్లను ఆదివారం తెల్లవారుజామున భారీ బందోబస్తు నడుమ అధికారులు తొలగించారు. ఇళ్ల తొలగింపునకు అధికారులు శనివారం గట్టి ప్రయత్నం చేసినప్పటికీ పేదల నుంచి ప్రతిఘటన ఎదురవ్వడంతో వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. ఈ సమయంలో పోలీసులు అధికారులు సిపిఎం నేతలు, నిరుపేదలతో చర్చలు జరిపారు. జిల్లా అధికారులతో మాట్లాడుకోమని అవకాశం ఇచ్చారు. అయితే సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌ను భీమవరంలో, పాలకోడేరు మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను పెన్నాడలో ఇళ్ల వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఎఎస్ఆర్ నగర్‌లో 144 సెక్షన్ విధించారు. ఆదివారం వేకువజామునే ఎఎస్ఆర్ నగర్‌ను ప్రత్యేక పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుని ఇళ్లలో నిద్రిస్తున్న వారిని లేపి ఖాళీ చేస్తారా లేక అలాగే ఇళ్లు కూల్చేయమంటారా అని భయభ్రాంతులకు గురి చేశారు. కనీసం సామాన్లు తీసుకునే సమయం ఇవ్వాలని కోరినా వెంటనే ఖాళీ చేయకపోతే అలానే కూల్చేస్తామంటూ బెదిరింపుల పర్వానికి దిగారు. మరోపక్క ఇళ్లకు కరెంటు కనెక్షన్లు తొలగించారు. ఇంటికి పది మంది చొప్పున పోలీసులను మొహరించారు. వృద్ధులు, మహిళలు, పేదలు పోలీసులకు దండం పెట్టి మా ఇళ్లను పడగొట్టకండి అయ్యా అని వేడుకున్నా పట్టించుకోకుండా ముందుకు సాగారు. ఇంటి స్థలం ఇవ్వకుండా.. ఏళ్ల తరబడి ఉంటున్న ఇంటిని కూల్చేయడంతో ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో నిరుపేదలు బరువెక్కిన గుండెతో కన్నీరుమున్నీరవుతూ సామాన్లపై పక్కనే రోడ్డుపై కూర్చుని పడగొట్టిన తమ ఇళ్ల శిథిలాల వైపు చూస్తుండటం అందరినీ కలిచివేసింది.

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, మండల కార్యదర్శి అశ్రియ్య గృహనిర్బంధం

భీమవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌ను, పెన్నాడలో మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఒకపక్క జిల్లా అధికారులతో మాట్లాడుకోమని అవకాశం కల్పించిన పోలీసులు, అధికారులు మాట తప్పి నిర్బంధం ప్రయోగించడం గమనార్హం. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ కుముదవల్లి కాల్వ గట్టు నుంచి ఎఎస్ఆర్ నగర్‌లోకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచి పాలకోడేరు పోలీస్ స్టేషన్‌కు, అక్కడ నుంచి భీమవరం రూరల్ స్టేషన్‌కు సత్యనారాయణను తరలించారు.

42 ఇళ్లను కూలగొట్టిన అధికారులు

ఎఎస్ఆర్ నగర్‌లో 1986 నుంచి 130 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరిలో కొంతమందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే సంబంధిత ప్రభుత్వ కాలనీ నివాస యోగ్యంగా లేదు. మరికొంతమందికి ఇచ్చిన ప్రభుత్వ స్థలం కోర్టు కేసులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎఎస్ఆర్ నగర్‌లో ఇళ్ల తొలగింపు చేపట్టిన నేపథ్యంలో కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. మిగిలిన 50 ఇళ్లు కూల్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఆదివారం సాయంత్రానికి 42 ఇళ్లను కూలగొట్టారు. కోర్టు కేసు పరిష్కారమయ్యాక మిగిలిన ఇళ్లనూ తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

పేదల గుడిసెలు కూల్చడమేనా అభివృద్ధి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : పేదల గుడిసెలు కూల్చడమేనా కూటమి ప్రభుత్వం అభివృద్ధి అంటే అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో పేదల గుడిసెల కూల్చివేతను ఖండిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇప్పటికే ఉండి నియోజకవర్గంలోని కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాల్లో పేదల గుడిసెలు కూల్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యాన్ని తీసుకొస్తున్నారని, పేదల పట్ల తీవ్ర వ్యతిరేక భావంతో, ద్వేషంతో ఈ రకంగా పేదల గుడిసెలన్నీ కూల్చుతున్నారని పేర్కొన్నారు. ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు ఇంత దుర్మార్గానికి పాల్పడుతున్నా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకోవడం లేదని తెలిపారు. ఈ వైఖరి ఇదేవిధంగా కొనసాగితే ఆంధ్రప్రదేశ్ యావత్తు బుల్డోజర్ రాజ్యం వస్తుందని, పేదల గుడిసెలు కూల్చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ చర్యలకు పాల్పడ్డ వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని, గుడిసెల కూల్చివేతకు గురైన పేదలకు ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. కూల్చివేతకు కారకుడైన డిప్యూటీ స్పీకర్, అధికారులు, పోలీసులు పేదలకు క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు.

ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సెంటర్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లిలో ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది నిలిచిపోయిన పనులను అధికారులు మళ్లీ ప్రారంభించారు. దీంతో నెల రోజుల నుంచి ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్ కాలనీ, ప్రధాన సెంటర్లో, వై.కూడలి వద్ద యంత్రాలతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముదినేపల్లి ఊరు వెలుపల రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ముదినేపల్లి ప్రధాన సెంటర్లో మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ సెంటర్లో డ్రెయిన్ల నిర్మాణం అసంపూర్తిగా చేసి మధ్యలో వదిలేశాడు. సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే నీరు బయటికి వెళ్లే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తోంది. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణం కారణంగా ముదినేపల్లి సెంటర్లో ప్రజలు నానావస్థలు పడుతున్నారు. ఆరు నెలల క్రితం నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు నెల రోజుల నుంచి మళ్లీ ప్రారంభం కావడంతో ఈసారైనా పనులు పూర్తి చేస్తారనే ఆశాభావాన్ని ముదినేపల్లి గ్రామస్తులు, వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిఇ సత్యనారాయణను వివరణ కోరగా ముదినేపల్లి సెంటర్లో మే నెలాఖరుకు డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

అగ్నిమాపక అధికారి మత్తయ్య

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి మత్తయ్య

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరమని అగ్నిమాపక అధికారి మత్తయ్య సూచించారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద డ్వాక్రా మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తయ్య మాట్లాడుతూ వంట చేసుకునే సమయంలో గ్యాస్ బండ లీక్ అవ్వడం ద్వారా జరిగే విపత్తులను ఎలా ఎదుర్కోవాలనే విషయాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడు రోజుల నుంచి అవగాహనా సదస్సు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. చివరిరోజు ఆదివారం అగ్నిమాపక కేంద్రం వద్ద మహిళలకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో పఠాన్ జరీనా ప్రతిభ

- ఆలిండియా 369వ ర్యాంకు
- పలువురి అభినందన
- నిట్‌లో సీటు వచ్చే అవకాశం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



పఠాన్ జరీనాను అభినందిస్తున్న పలువురు ప్రముఖులు

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో పఠాన్ జరీనా ఆలిండియా ర్యాంక్ 369 సాధించింది. ఆమె పఠాన్ యాకూబ్ కుమార్తె. యాకూబ్ ఒక పళ్లెంలో సాంబ్రాణి, అలాగే నిప్పులు తీసుకుని దుకాణాలకు నడుచుకుంటూ వెళ్లి సాంబ్రాణి వేసి వాళ్లిచ్చిన డబ్బులు తీసుకుని వస్తూ ఉంటారు. ఆ డబ్బులతో తమ పిల్లలను చదివించుకుంటున్నారు. ఆయన చిన్న కుమార్తెత పఠాన్ జరీనా జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా ర్యాంక్ 369 సాధించింది. ఆ అమ్మాయికి ఈ బిసి కోటాలో మనదేశంలోని ప్రతిష్టాత్మక నిట్ కళాశాలలో సీటు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ విజయానికి కారణం వర్తక సోదరుల ఆదరణ, అభిమానం, ప్రేమ, వారు పఠాన్ యాకూబ్ కులం, మతం చూడకుండా దుకాణానికి వచ్చాడని, ఖాళీగా పంపించకూడదనే ఉద్దేశంతో చేసిన దానం ఆ కుటుంబానికి ఆలంబనగా నిలబడటమే కాకుండా ఆ అమ్మాయి అత్యున్నత చదువులు చదవటానికి దోహద పడింది. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని వర్తక సోదరులాందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆ అమ్మాయి అత్యున్నత చదువులు చదువుకుని ఈ దేశానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేస్తుందని ఆశిద్దాం. భిన్న మతాలు, జాతులు, సంస్కృతులు ఉన్నా అందరూ ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రేమతో కలిసి జీవించడం కేవలం ఒక్క భారతదేశంలోనే సాధ్యం.

జూనియర్ కళాశాలలో బైపిసి

ముదినేపల్లి ఎస్‌జివి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మూర్తి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ఎస్‌జివి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో గ్రూపుల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఈ కళాశాలలో ఎంపిసి, హెచ్‌ఇసి, సిఇసి గ్రూపులు ఉన్నాయి. ఈ ఏడాది నుంచి కొత్తగా బైపిసి, ఎం బైపిసి గ్రూపులను కూడా ప్రవేశపెట్టనున్నారు. కొత్త గ్రూపుల్లో ఒకొక్క గ్రూపునకు 44 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి ఉందని కళాశాల ప్రిన్సిపల్ ఒఎస్ఎన్.మూర్తి తెలిపారు. ప్రిన్సిపల్ మూర్తి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు మండలంలోని వివిధ హై స్కూళ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశపెట్టనున్న గ్రూపుల గురించి ప్రచారం నిర్వహిస్తున్నారు. బైపిసి, ఎం బైపిసి గ్రూపులు ప్రవేశపెడితే కళాశాలలో ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు, బోటనీ, జువాలజి అధ్యాపకులను నియమించేందుకు ఇంటర్మీడియట్ బోర్డ్ సిద్ధంగా ఉన్నట్లు ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు.

ఆశావర్కర్లకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆశావర్కర్లకు వేసవి కాల దృష్ట్యా గొడుగులు పంపిణీ చేయటం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి జి.జగన్మోహనరావు అన్నారు. హెల్ప్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి పిహెచ్‌సి పరిధిలోని 30 మంది ఆశావర్కర్లకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్, వి.ప్రాజెక్ట్ అధికారి మాచినేని సాయి రమ్య, మాచినేని లక్ష్మీప్రసన్నకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొడుగులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి జగన్మోహనరావు

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రులో జిబీవల నిర్వహించిన ఉపాధి హామీ చట్టం పనులకు వెళ్లిన గ్రామానికి చెందిన కూలీ ఓగిరాల శివ పార్వతి(45) గుండెపోటుతో మరణించింది. ఆమె భర్త పక్షవాతంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అమరావతి గ్రాండ్ అంబాసిడర్ అంబులు వైద్యులు రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును ఆమె తండ్రి డాక్టర్ అంబులు మనోజ్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

186 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని రామకోటి ప్రాంగణంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయ వేమగిరి వారి బృందం బాలకృష్ణ సహకారంతో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ మెంబర్ మానేపల్లి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతినెల మూడో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 186 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి ఆపరేషన్ అవసరముగా గుర్తించి వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారని, 36 మందికి రాయితీ ధరకు కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఏలూరు ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. బోలిశెట్టి సురేష్, అజయ్ కుమార్ సహకారాలు అందించారు.

చింతమనేని కుమారుడి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కుమారుడు ప్రేమ్‌బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని ప్రేమ్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులకు ప్రేమ్‌బాబు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చింతమనేని అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన వివిధ సేవా కార్యక్రమాల్లో చింతమనేని ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ప్రేమ్‌బాబు

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సన్నాహాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కొత్తూరులో ఏడు అడుగుల బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సిఐడి మాజీ చీఫ్ పి.వి.సునీల్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమం తేదీ నిర్ణయం కోసం గ్రామ పెద్దలు ఆదివారం చింతలపూడిలోని సునీల్ కుమార్ నివాసంలో సమావేశమై చర్చించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ మండలాధ్యక్షులు తోర్లపాటి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఉసల సుభాష్ చంద్రబోస్, మండల కార్యదర్శి కొనల పాపేశ్వరరావు, బోసగిరి ఆశీర్వాదం, కొడమంచిలి జాన్ వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

లాడ్జిల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలో సంబంధిత డిఎస్‌పిల ఆధ్వర్యంలో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏకకాలంలో లాడ్జిలను తనిఖీ చేశారు. ఏలూరు నగరంలోని ఒకటి, రెండు, మూడు పట్టణ పరిధిలో ఆయా సిఐల ఆధ్వర్యంలో లాడ్జిలను తనిఖీ చేశారు. అలాగే రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిలను రూరల్ ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. అంతేకాకుండా లాడ్జిల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. లాడ్జికు వచ్చిన వారి పూర్తి వివరాలను నిర్వాహకులు సేకరించి లాక్ బుక్‌లో పొందుపరచాలని వారు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆలయంలో చోరీ : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని రత్నాపురం గ్రామంలో ఉన్న రామాలయంలో బంగారు వస్తువులు దొంగతనం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన కట్టా సుబ్బారావు ఈ నెల 14వ తేదీ రాత్రి కొయల్లు గ్రామపంచాయతీ పరిధిలోని రత్నాపురం ఆవాస ప్రాంతంలో ఉన్న రామాలయం తలుపులకు ఉన్న తాళాలను బద్దలకొట్టి లోపలికి ప్రవేశించి విగ్రహాలపై ఉన్న సుమారు 17 గ్రాముల బంగారు వస్తువులను అపహరించాడు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భీమడోలు పోలీసులు విచారణ చేశారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం గుండుగొలను సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

మోటార్ సైకిల్ చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మోటార్ సైకిల్ చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ చోరీ మండల కేంద్రమైన ముదినేపల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సింగారానికి చెందిన బి.రమేష్ పల్సర్ మోటార్ బైక్ మరమ్మతులకు గురికావడంతో ఈ నెల 14వ తేదీన ముదినేపల్లిలోని గురజ రోడ్డులో నివాసం ఉంటున్న తన స్నేహితుని ఇంటివద్ద ఉంచాడు. మరుసటి రోజు వచ్చి చూడగా మోటార్ బైక్ కనిపించలేదు. దీంతో ఎంత వెతికినా కనిపించకపోవడంతో తన బైక్ చోరీకి గురైందంటూ రమేష్ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కోడివ్యర్థాలు స్వాధీనం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని లింగంపాడు ఆవాస ప్రాంతంలో ఉన్న చేపల చెరువుకు మేతగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన ఎం.రాంబాబు, ముసునూరు మండలం రంగంపేట గ్రామానికి చెందిన పి.వెంకటరమణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సేకరించిన కోడి వ్యర్థాలను చేపల మేతగా లింగంపాడుకు తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం కోడి వ్యర్థాలను గంటా మోహన్‌రావు అనే ఆక్వా రైతుకు చెందిన చెరువు వద్ద దిగుమతి చేస్తుండగా పోలీసులు దాడులు చేశారు. కోడి వ్యర్థాలతో పాటు, వాటిని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. వాటిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిర్లక్ష్యపు నీడలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు

ఉద్యోగోన్నతులు లేక సతమతం

పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - మండవల్లి

ఉపాధ్యాయ వర్గాల్లో అత్యధికంగా ఉండే కేటగిరి ఎవరంటే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులే. ప్రాథమిక విద్యావ్యవస్థకు బీజం వేసింది వీరే అనడంలో ఎటువంటి సందేహం లేదు. జిల్లావ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 11,500 మందికి పైగా ఉపాధ్యాయులు ఉండగా అందులో సగానికి పైగా అంటే ఆరు వేల మంది ఎస్‌జిటిలే ఉండడం గమనార్హం. అయితే గత 15 సంవత్సరాలుగా పాలకులు, సంఘ నాయకుల తీరుతో ఎస్‌జిటిలకు ఎలాంటి ఉద్యోగోన్నతులు లేక అధిక పని భారంతో సతమతమైపోతున్నారు. దీంతో గ్రౌండ్ స్థాయిలో ఎస్‌జిటిలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నాయకుల నిర్లక్ష్య వైఖరి పట్ల వారు ఆగ్రహంతో ఉన్నట్లు స్పష్టమవుతుంది.

ఉద్యోగోన్నతి మాటే మరిచారు

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా సుమారు 24 నుంచి 28 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్నప్పటికీ సర్వీసులో వచ్చే ఒకే ఒక్క ఉద్యోగోన్నతి (స్కూల్ అసిస్టెంట్)కూడా పొందకుండానే వేలాదిమంది ఉద్యోగ విరమణ చెందుతున్నారు. ఇందులో అనేకమంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు కూడా ఉండడం గమనార్హం. అదే ఒక ప్రభుత్వ కార్యాలయంలో జూనియర్

అసిస్టెంట్‌గా ఉద్యోగంలో ప్రవేశిస్తే కేవలం ఐదు, ఆరేళ్లలోనే ఉద్యోగోన్నతి పొందుతారు. అదే 25 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుంటే మండల స్థాయి అధికారి కూడా అవుతారు. కాని ఎస్‌జిటిలుగా ఉద్యోగం ప్రారంభించిన తాము ఏ ఒక్క ఉద్యోగోన్నతి పొందలేకపోతున్నామని ఎస్‌జిటిలు వాపోతున్నారు.

సర్దుబాటుకు వీరే

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత హై స్కూల్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉండడంతో ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా అర్హత కలిగిన ఎస్‌జిలను ఆయా పాఠశాలల్లో సర్దుబాటు చేయడంతో పాటు అనేక మందిని దూర ప్రాంతాలకు కూడా డిప్యూటేషన్ వేశారని, ఇదెక్కడి న్యాయమని నాడు మొత్తుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిని విద్యా శాఖలో ఆల్‌రౌండర్‌గా భావించాలని రిటైర్ ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. గుమస్తా నుంచి కంప్యూటర్ ఆపరేటర్ అవతారం కూడా వీరే అని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

అదనపు అర్హత ఉన్నా నిరుపయోగమే

గత వైసిపి ప్రభుత్వం పండిట్ల పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. దీంతో సర్వీసులోకి వచ్చిన రెండు మూడు సంవత్సరాలల్లోపే పండిట్లు అందరూ ఎస్ఎలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఎస్‌జిటిల్లో కూడా అనేకమంది ఎంఎ (తెలుగు, హిందీ) బిఎ (తెలుగు, హిందీ) అర్హతతో పాటు బిఇడిలో అర్హత కలిగి ఉన్న వారికి 2018 డిఎస్‌సిలో అవకాశం కల్పించడంతో ఎస్‌జిటిలుగా పనిచేస్తున్న వారు కనీసం స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందుతారని ఆశించారు. కాని ప్రభుత్వం, సంఘాల నిర్లక్ష్య వైఖరితో ఉద్యోగోన్నతులు రాకుండా పోయాయని, అదే ఎంఎ (ఇంగ్లీష్) అర్హత ఉన్నవారికి ఉద్యోగోన్నతులు కల్పించారని, ఇదెక్కడి న్యాయమని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఎస్‌జిటిలతో పోలిస్తే 20 శాతం కూడా పండిట్లు లేకపోయినా వారిదే పైచేయిగా ఉండడం గమనార్హం. గతంలో పండిట్లు గ్రేట్ టు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతులు ఉండేవి. కాని తర్వాత కాలంలో ప్రభుత్వం వారికి కూడా గెజిటెడ్ హోదా కలిగిన ఉద్యోగోన్నతి కల్పించారని, మరి ఇదేలా సాధ్యమవుతుందని గుర్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయునిగా అప్పారావు సేవలు అభినందనీయం

ఉద్యోగ విరమణ సభలో ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

36 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో అప్పారావు సేవలు అభినందనీయమని, ఎంతోమంది విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని వికెఎం ఫంక్షన్ హాలులో 36 ఏళ్లుగా ఉపాధ్యాయులుగా సేవలందించిన అప్పారావు ఉద్యోగ విరమణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ఎంఎల్‌సి గోపీమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్‌గా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారన్నారు. చింతలపూడి ప్రాంతంలో యుటిఎఫ్ బలోపేతం అవడానికి ఆయన కృషి ఎనలేనిదన్నారు. పూర్వకాలంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంగా ఉండేవని, ప్రస్తుతం బలహీనంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బలహీనం అవడానికి కారణాలు తెలుసుకుని, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. అప్పుడే ఇలాంటి ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణకు సార్ధకత ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంగా ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో ముందు ఉన్నాయన్నారు. కార్పొరేటు, ప్రయివేట్ పాఠశాలలు బలోపేతంగా ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో వెనకబడ్డాయన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పూరేటి శ్రీనివాసరావు, దామోదరరావు, ప్రేమ్, బుచ్చిబాబు, పాండురంగారావు, అనుబంధ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజేష్ శ్రమల దినములు 40 రోజులు బైబిల్ క్విజ్ 50 మార్కులకు పెట్టారు. ఈ పోటీల్లో బొబ్బిలి దుర్గాభవాని (ఏలూరు) మొదటి బహుమతి, రేవులగడ్డ.మేహన మెరిసి (ఏలూరు) రెండో బహుమతి, అబ్బదాసరి శ్రీను (అంకంపాలెం) మూడో బహుమతి, కందికొండ యేసేపు (పోలవరం) నాలుగో బహుమతి, బయగాని మల్లికార్జునరావు (పర్వతాపురం) ఐదో బహుమతి పొందినట్లు కల్లేపల్లి రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడారు.

జనసేనలోకి చేరిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలోని 29వ డివిజన్ తాపీ మేస్త్రీ కాలనీ, కుమ్మరి రేవు కాలనీకి చెందిన సుమారు వంద మందికి పైగా వైసిపి నాయకులు, కార్యకర్తలు రామిశెట్టి కళ్యాణ్, మంగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు. ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు, జనసేన నాయకులు నారా శేషు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు.

గొల్లగూడెం వద్ద రోడ్డు ప్రమాదం

తప్పిన ప్రాణ ముప్పు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - దోబచర్ల ఆర్అండ్‌బి రహదారిలో గొల్లగూడెం వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాణ ముప్పు తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గోపీనాథపట్నం నుంచి కొయ్యలగూడెం కర్రల లోడుతో వెళ్తున్న వ్యాన్, గొల్లగూడెం నుంచి చేబ్రోలు వైపు వెళ్తున్న లారీ గొల్లగూడెం మలుపు వద్ద ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కర్రల వ్యాను ముందు భాగం డ్రైవర్ క్యాబిన్ ధ్వంసమైంది. లారీ వెనుక భాగం నాలుగు చక్రాలు హౌజింగ్ ఊడిపోవడంతో ఆ లారీ రోడ్డు అంచున దిగబడిపోయింది. అయితే కర్రల వ్యాన్ డ్రైవర్, మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. మలుపు కారణంగా వాహన రాకపోకలకు ఆటంకం కలిగింది. రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ నిలిచింది. విషయం తెలుసుకున్న చేబ్రోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రమాదస్థలంలో వ్యాన్, లారీ

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

దెందులూరులో...

ప్రజాశక్తి - దెందులూరు

సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని దెందులూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో విజన్-2047, రాష్ట్రాభివృద్ధి అంశాలపై టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలు గా నిలిచిన దెందులూరు గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు స్టడీ చైర్లను బహుమతులుగా అందించారు. అప్పన్నవీడులో జరిగిన వేడుకల్లో కూటమి నాయకులతో పాల్గొని కేక్ కట్ చేశారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టి.నరసాపురం : సిఎం చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీ రామమూర్తిల చేతుల మీదుగా పుట్టినరోజు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడన్నారు. స్వర్ణాంధ్ర ఏర్పాటు చంద్రబాబుకే సాధ్యమన్నారు. పోలవరం ప్రాజెక్టు అమరావతి నిర్మాణం చంద్రబాబు సారథ్యంలో పూర్తి కానున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడు రామకృష్ణారావు గౌడ్, జోనుబోయిన సోంబాబు, వాసిరెడ్డి మోహన్‌రావు, బొంతు సత్యనారాయణ, కొండపల్లి రవి, సందేపూడి సాయి, అద్దంకి జగ్గారావు, పిన్నమనేని మధు, కాల్నీడి రాంబాబు, కొల్లి మురళి, కాసన్నేని మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పలు ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమడోలు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఆయనతో పాటు బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ మాలతీ

భీమడోలులో...

రాణితో కలిసి కేకును కోశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వివిధ ప్రాంతాల్లో గల ప్రార్థనాలయాలు, ఇతర ప్రాంతాలను సందర్శించారు. పొలసానిపల్లిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి నాయకులతో కలిసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఏలూరు సిటీ : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, ఎంపీ కార్యాలయం సిబ్బంది కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సిఎం చంద్రబాబు అలుపెరుగని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. సిఎం చంద్రబాబుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు చంద్రబాబు స్ఫూర్తితో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు కేక్ కట్ చేశారు. దర్భగూడెంలో టిడిపి మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె పంచారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తమ్మన సాంబ, పి.రాము, కృష్ణ, నరసింహ మూర్తి, పుల్లయ్య, కిరణ్, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో స్థానిక ఆయన నివాసం వద్ద కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల వసతి గృహం వద్ద విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, అగ్నికుల క్షత్రియ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుల అంద్రాజు శ్రీనివాసరావు, లంక రత్నారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఉపాధి హామీ కూలలకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ముసునూరులో...

వేలేరుపాడు : స్థానిక టిడిపి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులందరూ కలిసి టపాసులు కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుమేళ్ల సుధాకర్, కట్టం ముత్యాలరావు, గొంది నాగేశ్వరరావు, కరటూరి రాధాకృష్ణ, కోటిపల్లి ముత్యాలరావు, శాఖమూరి సంజీవులు, పసుపులేటి లక్ష్మయ్య తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మండలంలోని 16 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూర్యదేవర శ్రీనివాసరావు, గద్దల మోహనరావు, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, పిన్నిబోయిన మంగయ్య, పాకనాటి సీతారాం, పాకనాటి ఆంజనేయులు, కొండేటి బాబి, గరికముక్కు నాని, తుమ్మల నాగేశ్వరరావు, దేవినేని డలరామ్, మెదరమెట్ల సురేంద్ర, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారాం, గద్దె రఘుబాబు, పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, దేవినేని సాంబయ్య, తోట శ్రీనివాసరావు, నక్క యోహన్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

క్రైస్తవ సోదరుల అభ్యున్నతికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందని, క్రైస్తవ సోదరులకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అందిస్తుం దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఈస్టర్ సందర్భంగా పట్టణంలోని పెంతు కోస్తు దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవ సోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో, క్రైస్తవ పెద్దలు పాస్టర్లు, నాయకులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, చర్చి ఫాదర్లు, సిస్టర్లు, చర్చి పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : సిఎస్ఐ, లూథరన్, బాప్టిస్ట్, రోమన్ క్యాథలిక్, న్యూ లైఫ్ ఫెలోషిప్ తదితర సంఘాలతో పాటు అన్ని సంఘాల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు జరుపుకున్నారు. నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతంలో ఉన్న క్రైస్తవుల సమాధుల తోటలో ఉదయం నాలుగు గంటల నుంచి వందలాదిమంది తమ కుటుంబ సభ్యుల, బంధువుల సమాధులను అలంకరించారు. బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అక్కడకు వచ్చిన వారికి అల్పాహారం, కాఫీ, టీ వంటివి ఏర్పాటు చేశారు. ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ, గూటాల, పోలవరం పలు గ్రామాల చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చనిపోయిన తమ కుటుంబీకుల సమాధులపై పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కొత్తపట్టిసీమ సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో సంఘ కాపరి ఐ నోవాహు, చర్చి సిఆర్‌డి ఇమ్మానియేల్, ఆల్టర్నేట్ డెలిగేట్ జి.అబ్రహం, సంఘస్తులు, సంఘ పెద్దలు, సండే స్కూల్ పిల్లలు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని దర్భగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లోని ఆర్‌సిఎం దేవాలయాల్లో, జీలుగుమిల్లిలోని గ్రేస్ మందిరాల్లో ఆయా సంఘాల విచారణ కర్తలు అంతలయ్య, ఎజ్రాశాస్త్రి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల విచారణ కర్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రార్థన మందిరాలు విశ్వాసులతో కిటకిటలాడాయి. పలు చర్చిల్లో శనివారం రాత్రి నుంచే ఈస్టరు ప్రత్యేక ఆరాధనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని పలు చర్చిల వద్ద ఈస్టర్‌ను పురస్కరించుకుని అన్న సమారాధనలు నిర్వహించారు. ముదినేపల్లిలోని ఆర్‌సిఎం, ఎల్ఇఎఫ్, పెనుయేలు, బెతేస్తా, చర్చి ఆఫ్ క్రైస్ట్, సిబిసిఎన్‌సి తదితర ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు విశ్వాసులకు సందేశం అందించారు. ముదినేపల్లిలోని ఎన్‌డిఎ కార్యాలయంలో టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ కట్ చేశారు. పేదలకు ఉచిత అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత ఎంఎల్ఎ మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో నిర్వహించిన వేడుకల్లో పాస్టర్ బెనర్జీ పాల్గొని మాట్లాడారు.

కొయ్యలగూడెం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చనిపోయిన తమ కుటుంబసభ్యులు, పూర్వీకుల సమాధులను కొవ్వొత్తులతో, పువ్వులతో ఆకర్షణీయంగా అలంకరించారు.

CHANGE OF NAME

I **KARRI SANTOSH REDDY** S/o. **SURIREDDY KARRI**, HINDU Male , residing at 10-30-40/1,paiboina venkata-ramaiah gari veedhi Bhagyalakshmi peta, Tadepalli gudem,West Godavari Dist,AP solemly affirm as fallows 1) I am resident of Tadepalligudemin that my name noted as **BADARALA SANTOSH** but as per my Aadhar card &Pan card correct name is **KARRI SANTOSH REDDY** 2).Hence I confirm and affirm that my correct name is **KARRI SANTOSH REDDY** should be considered for all purpose.